www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 21 సెప్టెంబర్ 2024
5
అన్నమయ్య



'ఆదిత్య' పూర్వ విద్యార్థికి ఆర్థిక సాయం



పూర్వ విద్యార్థి తండ్రికి చెక్ ఇస్తున్న రామలింగారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, ఆదిత్య హెల్పింగ్ హాండ్స్ మరియు ఆదిత్య అల్యూమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్న పూర్వ విద్యార్థి టి.వేదానంద్ (Reg.No 208P5A0412)కి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశామని కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. వేదా నంద ఎస్టీ జాన్స్ మెడికల్ హాస్పిటల్ బెంగళూర్‌లో బ్లడ్ కేన్సర్‌కి ప్రథమ చికిత్స పొందుతున్నాడు. ఈ చికిత్సకు సుమారు రూ.నాలుగు లక్షల వరకు ఖర్చవుతుందని, వ్యాధి తీవ్రతను బట్టి ఖర్చు పెరిగే అవకాశం ఉందని డాక్టర్లు తెలిపారని అందులో భాగంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్ రామలింగారెడ్డి, చైర్మన్ ఆర్ రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎం.నాగ మల్లారెడ్డి రూ.50 వేలు చెక్కుని వేదానంద తండ్రికి అందజేశారు.

తమ్ముళ్ల తన్నులాట

- అన్నక్యాంటీన్ల ప్రారంభోత్సవంలో బాహాబాహీ
- రాజంపేట, చక్రాయపేటలో రచ్చ
- కడపలోనూ నాయకుల మధ్య విబేధాలు
- పార్లమెంట్ అధ్యక్షుని ఇంటిపై రాళ్లదాడి





రాజంపేటలో అన్నక్యాంటీన్ ప్రారంభోత్సవంలో గొడవపడుతున్న తెలుగు తమ్ముళ్లు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు పతాక స్థాయికి చేరాయి. రెండ్రోజుల కిందట ఉమ్మడి జిల్లా పులివెందుల నియోజకవర్గం పరిధిలోని చక్రాయపేట మండల ఇన్‌ఛార్జి వర్సెస్ కార్యకర్తల తిరుగుబాటు, తాజాగా రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాలసుబ్రమణ్యం వర్సెస్ పార్లమెంట్ అధ్యక్షులు జగన్ మోహన్‌రాజు గ్రూపుల మధ్య నువ్వానేనా అనే రీతిలో హోరాహోరీగా తలపడిన నేపథ్యం చర్చనీయాంశంగా మారింది. రాజంపేట నియోజకవర్గ పరిధిలోని కేడర్ రెండుగా చీలిపోయింది. రాజంపేట పార్లమెంట్, నియోజకవర్గ స్థాయి నాయకుల మధ్య పొగసని వాతావరణం తెలుగు తమ్ముళ్ల పరువును బజారు పడేసిందని చెప్పవచ్చు.

ఉమ్మడి జిల్లా తెలుగుతమ్ముళ్ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చోటుచేసుకున్న వెన్నుపోటు రాజకీయాలే పరస్పర విభేదాలకు, దాడులకు కారణమని తెలుస్తోంది. రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యానికి నియోజకవర్గంలోని పలువురు సీనియర్లు సహకరించకపోవడంతో ఓటమి పాలైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి లోలోపల రగిలిపోతున్న నాయక గణం అదునుకోసం నిరీక్షించింది. రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి సర్కారు పలు దఫాలుగా అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తూవస్తోంది. గురువారం రాజంపేటలో అన్నక్యాటీన్ ప్రారంభోత్సవాన్ని టిడిపి అసెంబ్లీ ఇన్‌ఛార్జి బాలసుబ్రమణ్యం నిర్వహించారు. పార్లమెంట్ అధ్యక్షులు జగన్ మోహన్‌రాజును ఆహ్వానించకపోవడం, ప్రొటోకాల్ పాటించకపోవడంతో ఇద్దరి అనుచరుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుసుకుంది. అనం తరం ఇరు గ్రూపుల మధ్య తోపులాటలతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనంతరం రాత్రి పది గంటల సమయంలో రాయచోటిలో పార్లమెంట్ అధ్యక్షుని ఇంటిపై రాళ్ల దాడి చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇందులో ఎవరి తప్పో, ఎవరిదో ఒప్పో తెలియనప్పటికీ తమ్ముళ్ల మధ్య తన్నులాట మరోసారి బహిర్గతం కావడం గమనార్హం.

టెన్షన్..టెన్షన్..

రాజంపేటలో ఉత్కంఠభరిత వాతావరణం నెల కొంది. ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ కేంద్రంగా తమ్ముళ్ల మోహరింపు తీవ్ర ఉత్కంఠను కలిగించింది. సహజంగా ఇటువంటి దాడులు, ప్రతిదాడుల ఘటనలు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య చోటు చేసుకోవడం పరిపాటి. ఇందుకు విరుద్ధంగా అధికార పార్టీలోని తెలుగు తమ్ముళ్ల మధ్య నెలకొనడం విస్మయాన్ని కలిగిస్తోంది. పులివెందుల నియోజకవర్గ పరిధిలో చక్రాయపేట మండల టిడిపి ఇన్‌ఛార్జిపై కార్యకర్తల తిరుగుబాటు ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి జోక్యం చేసుకోవడంతో తిరుగుబాటు తాత్కాలికంగా సద్దుమణి గింది. వీటితో పాటు కడప తెలుగుతమ్ముళ్ల మధ్య విభేదాలు పొంచి ఉన్న సంగతి తెలిసిందే.

నిర్లిప్తతలో అధిష్టానం

పార్టీ పరువును బజారున పడేసిన ఘటనలపై టిడిపి అధిష్టానం మీనమేషాలు లెక్కిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వెన్నుపోటు పొడిచిన నేతలపై వేటు వేయడంలో నిర్లక్ష్యమే సంక్షోబానికి కారణమనే వాదన వినిపిస్తోంది. ఉమ్మడి కడప జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, రాజంపేట అసెంబ్లీ అభ్యర్థులకు సహాయ నిరాకరణ చేసిన నాయకులపై ఎటువంటి చర్యలు లేకుండా వదిలేయడమే క్రమశిక్షణారాహిత్యానికి కారణమనే విమర్శలు ఉన్నాయి. టిడిపి నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా టిడిపి అధిష్టానం దిద్దుబాటు చర్యలకు దిగుతుందా లేదోననే ఆందోళన కేడర్‌లో నెలకొంది.

పేద ప్రజల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి 'ఏచూరి'

- సంస్మరణ సభలో పలువురు వక్తలు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్



మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న నరసింహులు

పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఏకైక వ్యక్తి సీతారాం ఏచూరి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఎన్‌జిఒ హోంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అధ్యక్షతన సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారతదేశంలో మతోన్మాదాన్ని చీల్చి చెండాడి ప్రతి ఒక్కరి హృదయంలో చోటు చేసుకున్నారని తెలిపారు. శత్రువులు కూడా బాధపడుతున్నారన్నారు. సీతారాం ఏచూరి మహా మేధావని భారతదేశం కోల్పోయిందని చెప్పారు. ప్రపంచంలో మిలీనియం మేధావిల్లో కాల్ మార్క్ అయితే భారతదేశంలో మేధావి సీతారాం ఏచూరని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలలో ఎర్రజెండాతో సంబంధాలు కొనసాగించిన వ్యక్తి సీతారాం ఏచూరని ఉన్నత కుటుంబంలో పుట్టి పేద వర్గాల కోసం నిరంతరం పోరాడి జీవితం మొత్తం అంకితం చేసిన నాయకుడని పేర్కొన్నారు. ఎర్రజెండా ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లి భారతదేశంలో అన్ని రాష్ట్రాలలో పార్టీని విస్తరింప చేశారని పేర్కొన్నారు. చదవడం ద్వారా పోరాటపటిమను పొంది, దానిని ఆచరణలో చూపించిన ఘనత ఏచూరిదన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులను ప్రభావితం చేసిన వ్యక్తి ఆయనని కొనియాడారు. నిజాయితీ నిబద్ధత ప్రస్తుత రాజకీయాల్లో కనపడేది కేవలం కమ్యూనిస్టుల్లో మాత్రమేనన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నమ్మి, ఆ భావాజాలాన్ని సమాజంలోకి చేర వేసి, యువతను ఆ దిశగా నడిపించడంలో సీతారాం ఏచూరి నిరంతరం కృషి చేశాడన్నారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ సీతారం ఏచూరి తెలుగువారు అయినందుకు గర్వించాలని తెలిపారు. వామపక్ష భావాలు కలిగి ఎన్నో పోరాటాలు చేశారన్నారు. భారతదేశానికి ఆయన ఎంతో అవసరమని తెలిపారు. పశ్చిమ బెంగాల్ నుంచి రెండు సార్లు రాజ్యసభకు పంపారని తెలిపారు. రాజ్యసభలో అనేక ప్రజల సమస్యలు తెచ్చి భారతదేశాన్ని అవసరమైన దిశా నిర్దేశం చేసిన నాయకుడని పేర్కొన్నారు. చిన్నతనం నుండి ఎస్ఎఫ్ఐ ఉద్యమంలో పెరిగిన నాయకుడని చెన్నైలో పుట్టి ఢిల్లీ జెఎన్‌యులో విద్యార్థిగా ఎదిగి ఈరోజు సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన మహా నాయకుడని తెలిపారు. కార్యకర్తలతో ప్రేమగా పలకరింపు చేస్తూ ప్రజలతో మమేకమవుతూ ముందుకు వెళ్లే వ్యక్తి సీతారాం ఏచూరని చెప్పారు. సీతారాం ఏచూరి భారతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేశారని ఏచూరి మరణం పార్టీకి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కె.ఎల్.నరసింహులు మాట్లాడుతూ సీతారాం ఏచూరి అపర మేధామన్నారు. ఇందిరాగాంధీ ఎదుటే రాజీనామా కోరిన గొప్పనాయకుడన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.చంద్రశేఖర్, ఎ.రామాంజులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పందికాళ్ల మణి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జాబీర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ రమేష్‌బాబు, రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి బుక్కే విశ్వనాథనాయక్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఖాజాబీ, ఒపిడిఆర్ సలహాదారులు టిఈశ్వర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు



సంస్మరణ సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

వృత్తి నైపుణ్యంతో జీవనోపాధి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వృత్తి నైపుణ్యంతో జీవనోపాధిని ఏర్పాటు చేసుకోవాలని సబ్ కలెక్టర్ వైఖమ్ నిదియా దేవి సూచించారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్యదారులకు అర్హత పత్రాల వితరణ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఆమె పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిషా'త్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ కార్యక్రమం ద్వారా లబ్ధిదారులు ప్రయోజనం పొంది జీవితాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పురుషోత్తమ్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్‌డిఎస్‌డిఇ అధికారి డి.మహేష్ మాట్లాడుతూ ఐదేళ్ల కాలానికి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం పదమూడు వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించారని, ఇప్పటికి పది లక్షల మంది లబ్ధిదారులు నమోదు చేసుకున్నారని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు సబ్ కలెక్టర్ చేతుల మీదుగా అర్హత పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకట నరసయ్య, రాజ మోహన్ రెడ్డి, నాగరాజ, ట్రైనర్ రాధ పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో 108 మందికి ఉద్యోగాలు

యువత లక్ష్యసాధన దిశగా చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే ఎంతటి కష్టతరమైన పనికూడా విజయవంతమవుతుందని సబ్ కలెక్టర్ నైదియా దేవి అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిసంస్థ ఆధ్వ7ర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకి 11 ప్రయివేట్ కంపెనీలు పాల్గొన్నాయి. 367 మంది హాజరువ్వగా 108 మంది యువతీ, యువకులు ఉద్యోగాలు సాధించారు. సెలెక్ట్ అయిన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నైదియా దేవి మాట్లాడుతూ చదువుతో పాటు ప్రతి ఒక్కరిలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో స్కిల్ హబ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, అక్కడ వెళ్లి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని యువతకు సూచించారు. యువత లక్ష్యసాధన దిశగా చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే ఎంతటి కష్టతరమైన పనికూడా విజయవంతం అవుతుందన్నారు. ఆ దిశగా ఉద్యోగం విషయంలో కూడా యువతీ, యువకులు సీరియస్‌గా ముందుకు సాగాలన్నారు. జీవితంలో ఏదైనా సాధించాలనే కసి, తపన, లక్ష్యం ఉండాలని ఉద్యోగం చిన్నదా, పెద్దదా అనే ఆలోచన కంటే ముందు జీవితంలో స్థిరపడాలనే లక్ష్యం ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, జెఇఒ డోనప్ప, జెడిఎం వేణు మాధవ్, వివిధ కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నదియా దేవి

వసతి గృహాల నిర్వహణ పటిష్టంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ వసతి గృహాలలో నిరుపేద పిల్లలు చదువుకోడానికి వస్తారని, వారందరినీ సొంత బిడ్డల్లా భావించి బాగా చదువుకునేలా ప్రోత్సహించడమే సంక్షేమ శాఖల అధికారులు హాస్టల్ వార్డెన్ బాధ్యతని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశాలలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు, హాస్టల్ వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణకు, భోజన పథకానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందిన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహకారం అందుతున్నా కూడా ప్రధానంగా ప్రభుత్వ వసతిగృహాలలో ఆహారం నాణ్యతగా లేదని ఫిర్యాదు వస్తోందన్నారు. మరుగుదొడ్లు పనిచేయడం లేదని, తాగునీటికి సింటెక్స్ ట్యాంకులు లేవని, చదువుకోడానికి విద్యుత్ బల్బులు లేవని ఇలా అనేక అంశాలలో ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఫిర్యాదులు రావడం ఎంత మాత్రం మంచిది కాదున్నారు. బాధ్యతల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై శాఖ పరంగా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వసతి గృహాల నిర్వహణ పటిష్టంగా ఉండాలిన్నారు. బాలికలున్న ప్రతి హాస్టల్లో శానిటరీ నాప్కిన్స్ డిస్పోజ్ మిషన్లు వెంటనే ఏర్పాటు చేయాలని సంక్షేమ అధికారులను ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన శుచి శుభ్రత కలిగిన ఆహారం అందించాలిన్నారు. వండిన ఆహారాన్ని ముందుగా ప్రిన్సిపల్ లేదా హాస్టల్ వార్డెన్ రుచి చూడాలిన్నారు. ఏడు నుంచి పదవ తరగతి చదువుతున్న బాలికలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రేమతో కష్టపడి పిల్లలపై శ్రద్ధ పెట్టి ఏదైనా ముఖ్యమైన కారణం లేకుండా అనవసరమైన కారణాలతో పిల్లలను బయటికి పంపరాదునారు. బయటి వ్యక్తులను ఎవ్వరిని అనుమతి లేకుండా పాఠశాల లేదా వసతిగృహంలోకి అనుమతించవద్దనారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను ఇస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

మెరిట్ స్కాలర్‌షిప్‌కు 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి మిట్స్ కళాశాలలో ఎంసిఎ మొదటి సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థిలకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పరివర్తన్ యొక్క ఇసిఎస్ఎస్ ప్రోగ్రామ్ (మెరిట్-కమ్-నీడ్ బేస్డ్) స్కాలర్‌షిప్‌లు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం హెచ్‌డిఎఫ్‌సి వారు విద్యార్థుల మెరిట్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ స్కాలర్‌షిప్‌లు అందజేసినట్లు తెలిపారు. దొడ్ల దీప్తి, నాదెండ్ల గిరి, ఏర్వ వెంకట తరుణ్, బి.సహిత, కంసల సంధ్యా రాణి స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులలో ఉన్నారని పేర్కొన్నారు. వీరికి ఒక్కక్కరికి రూ.35 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందజేసినట్లు పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమల్ బాషా, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ సమీనా, మౌలాలి అభినందించారు.

మున్సిపల్ ఆర్ఒగా విజయ్‌కుమార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మున్సిపల్ రెవెన్యూ ఆఫీసరుగా డోగుపర్తి విజయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా కమిషనర్ కె.ప్రమీలకు పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ గుడివాడ మున్సిపాలిటీలో ఆర్ఒగా విధులు నిర్వహిస్తూ బదిలీపై మదనపల్లి మున్సిపాలిటీకి బదిలీపై వచ్చానని పేర్కొన్నారు. మదనపల్లి పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి, మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అధికారులతో కలిసి సమన్వయంతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. నూతన ఆర్ఒగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ కుమార్‌కు కమిషనర్ కె.ప్రమీల, ఇతర మున్సిపల్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

దళితులపై కేసు నమోదు దుర్మార్గం : బిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లి

పెరియార్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తే దళితులపై కేసు నమోదు చేయడం దుర్మార్గమని బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతంకుమార్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఖచ్చితంగా దళిత వ్యతిరేక ప్రభుత్వమేనన్నారు. వైసిపి ప్రభుత్వంలో దళితులపై చేసిన దాడులు టిడిపి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో జరిగాయని చెప్పారు. మదనపల్లి లోదళితులపై జరుగుతున్న దమనకాండకు డిఎస్‌పి కొండయ్య నాయుడు, ఎమ్మెల్యే షాజహాన్ బాషా వ్యవహారసైలే కారణమని తెలిపారు. పెరియార్ జయంతి రోజు చేపట్టిన ర్యాలీకి డిఎస్‌పి అనుమతి ఇచ్చి ర్యాలీ ప్రారంభమయ్యే ముందు అనుమతి రద్దు చేసి అనంతరం బిఎస్‌పి నాయకులపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. డిఎస్‌పి దళిత వ్యతిరేక విధానాలతో ముందుకు వెళుతూ వారిని అణిచివేసే కుట్ర చేస్తున్నారన్నారు. మదనపల్లిలో ఊరేగింపుల పేరుతో తెలుగుదేశం పార్టీ నాయకుల ఫొటోలు పెట్టుకుని గంటలకొద్దీ ఊరేగింపులు చేస్తూ ఉంటే కనపడని ట్రాఫిక్ బిఎస్‌పి తమ మహనీయులు జయంతులు జరుపుకోవడంలో వచ్చిందా అని ప్రశ్నించారు. టిడిపి కూటమి ప్రభుత్వం బిజెపితో జతకట్టినప్పుడే ప్రజలు గ్రహించాల్సిందని, నేడు జరుగుతున్న దాడులకు టిడిపి కూటమి ప్రోత్సహిస్తుందన్న దాంట్లో ఎటువంటి సందేహం లేదు కాబట్టే ఈ విధంగా రాష్ట్రంలో మదనపల్లి నియోజకవర్గంలో విపరీతంగా దళితులపైన దాడులు కేసులు నమోదు చేస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు రమణ, బాలాజీ, గంగాధర్, చంద్ర, మల్లికార్జున, దంపెట్ల శివ, మహేష్, గూడుపల్లి శివ, అరుణ్, ప్రశాంత్, సంధ్య, కన్నయ్య, రెడ్డప్ప, సారథి పాల్గొన్నారు.

డయల్ యువర్ డిఎంకు విశేష స్పందన

ప్రజాశక్తి-పీలేరు

డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని డిఎం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి డిపో పరిధిలోని గ్రామాలకు చెందిన 11 మంది నుండి ఫోన్ కాల్స్ అందాయని తెలిపారు. అరుణాచలం, పీలేరు నుండి బెంగళూరుకు యలహంక, బనశంకరి, సిల్క్ బోర్డు, కోటిలింగాలకు విద్యాధరపురం బెంగళూరుకు కూడా బస్సు సర్వీస్ నడపమని కోరినట్లు చెప్పారు. పీలేరు ఆర్టీసీ బస్టాండ్‌లో ధరల ప్రకారం వస్తువులు విక్రయించేలా చూడాలని, పీలేరు బస్టాండులో రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. రాయచోటి బస్సులు ప్రకాష్ నగర్ దగ్గర ఆపడం లేదని ఫిర్యాదు చేశారు. పీలేరు-మదనపల్లి మధ్య ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడపాలని కోరారన్నారు. పలమనేరు నుండి రాయచోటికి కలికిరి మార్గంలో బస్సు సర్వీసు నడపమని కోరారని తెలియజేశారు. ప్రయాణికుల విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకుని ఈ సమాచారాన్ని ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని పీలేరు డిపో మేనేజర్ అన్నారు.

వాలంటీర్లకు భరోసా కల్పించాలి

ప్రజాశక్తి-పీలేరు : ప్రభుత్వం వాలంటీర్లకు ఇచ్చిన హామీ మేరకు తమకు బతుకు భరోసా కల్పించాలని వాలంటీర్ల సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ముందు జరిగిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన మంత్రివర్గ భేటీలోనూ వాలంటీర్ల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపో వడంతో తమలో ఆందోళన నెలకొందన్నారు. 100 రోజుల కూటమి ప్రభుత్వం తమను మోసం చేస్తోందని వాలంటీర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తాము గాంధీ మహాత్ముని ఆదర్శంగా తీసుకుని అక్టోబర్ 2 నుంచి 26వ తేదీ వరకు శాంతియుతంగా వినూత్న రీతిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. తదుపరి మంత్రివర్గ సమావేశంలోగా వాలంటీర్లకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయకపోతే సిఎం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె : ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం నుంచి నిర్వహించు మన ప్రభుత్వం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే షాజహాన్ భాషా తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 21వ తేదీ నుండి 26వ తేదీ వరకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పేరుతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమకు సంబంధించిన వినతులను సభలలో అందజేసి తక్షణ పరిష్కారం పొందవచ్చునని తెలిపారు. 21న పట్టణంలోని మాలిక్ ఫంక్షన్ హాల్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 23న పోతబోలుసచివాలయం, 24న నిమ్మనపల్లి మండలం రెడ్డివారిపల్లి సచివాలయం, 25న రామసముద్రం మండలం ఆర్.నడింపల్లి సచివాలయం, 26న సిటిఎం-2 సచివాలయ పరిధిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమాలలో ప్రజలు తమకు సంబంధించిన వినతులను అందజేసి తక్షణ పరిష్కారం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాదెళ్ల శివప్రసాద్, సంగం శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్, సంషీర్, నవీన్ చౌదరి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల పాల్గొన్నారు.

నేడు సంబేపల్లెకు మంత్రి 'మండిపల్లి' రాక

ప్రజాశక్తి-రాయచోటి

సంబేపల్లి మండలంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమానికి శనివారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరు కానున్నారని కలెక్టరేట్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పిస్తారని తెలిపారు. అర్జీదారులకు సత్వర పరిష్కారం చూపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

చంద్రబాబు పాలన దేశానికే ఆదర్శం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చంద్రబాబు పాలన దేశానికే ఆదర్శమని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు తెలిపారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో ప్రజలందరికీ సంక్షేమం అందించడంలో తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. పాలన అంటే ప్రజలపై భారాలు మోపకుండా వారికి సంక్షేమం అందజేస్తూ ప్రతి కుటుంబం యొక్క బాధ్యతను ప్రభుత్వ బాధ్యతగా తీసుకొని పాలన చేయడమేనన్నారు. రాష్ట్రంలో అలాంటి పాలనే కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతి పేదవాడికి సంక్షేమాలు అందజేస్తూ, పెన్షన్ పెంపు, ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మెగా డిఎస్సీ, మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, సిద్ధవటం, వీరబల్లి మండల అధ్యక్షులు శనివారపు మోహన్‌రెడ్డి, భానుగోపాల్ రాజు, మాజీ కళ్ళు గీత కార్మిక రాష్ట్ర డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి సమ్మెట శివప్రసాద్, మాజీ జడ్‌పిటిసి చలమయ్య యాదవ్, మాజీ ఎంపిపి లక్ష్మీనారాయణ నాయుడు, భాకరాపేట సర్పంచ్, ఎంపిటిసి ప్రతాప్, శ్రీనివాసులు నాయుడు, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు



మంత్రి లోకేష్‌తో ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి

లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజాశక్తి-పుల్లంపేట

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను శుక్రవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి యువనాయకుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి లోకేష్‌తో నియోజకవర్గంలో ఏర్పాటు చేయవలసిన అభివృద్ధి పనుల గురించి చర్చించినట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు, నైపుణ్య అభివృద్ధి విశ్వవిద్యాలయం, డయాలసిస్ సెంటర్, ఇంజినీరింగ్ కళాశాల స్థాపన కోసంచర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంతోపాటు ఇతర మండలాల్లో ఇసుక రీచులను ఏర్పాటు చేయాలని,ఇళ్ళ నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ఉచితంగా పంపిణీ చేసి భవణ నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని ఎఐటియుసి, ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలీంబాషా ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు శుక్రవారం ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బి.కొత్తకోట జ్యోతి చౌక్ వద్ద భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపి ర్యాలీ చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన డిటికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తంబళ్ళపల్లి నియోజకవర్గ కార్యదర్శి బి.వేణుగోపాల్ రెడ్డి, మండల కార్యదరి జి.రఘునాథ్ పాల్గొన్నారు.

24న మంత్రి 'మండిపల్లి' రాక

ప్రజాశక్తి-గాలివీడు

24వ తేదీన మండలంలోని గోపనపల్లిలో నిర్వహించే ప్రజాద'ర్బార్ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిరెడ్డి హాజరవుతారని మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటరెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించడం జరుగుతుందని అర్జీదారులకు సత్వర పరిష్కారం చూపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

స్వచ్ఛత మనందరి బాధ్యత

వీరబల్లి : స్వచ్ఛత మనందరి బాధ్యత అని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మనోహర్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌డికెఆర్ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్‌పై విద్యార్థులకు ప్రసంగాల పోటీ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెత్తను వీధుల్లో వేయకుండా జాగ్రత్త పడడమే కాకుండ ఇతరులు కూడ చెత్త వేయకుండా చూడాలని కోరారు. ఎస్‌డికెఆర్ కళాశాల డైరెక్టర్ రవిశేఖర్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ ప్రారంభించిన నాటి నుంచి ప్రజల చేతుల్లో చీపురులు చేత పట్టుకొని వీధులను ఊడ్చి వేయడం, చెత్త చెదరాన్ని తొలగించడం ఒక అలవాటుగా మారిపోయిందని తెలిపారు. విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోని అత్యంత మురికి దేశాల్లో భారత దేశం ఒక్కటని అలాంటి దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించడానికి ప్రతి ఒక్క విద్యార్థి నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు కళాశాల సిబ్బంది అంజలి, నాగయ్య, లక్ష్మణ్, శ్రీను బ్యాంక్ సిబ్బంది ఆశ్రఫ్, మణి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత

ప్రజాశక్తి-వీరబల్లి

విద్యార్థులకు ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డి క్రీడా దుస్తులు పంపిణీ చేశారని ప్రధానోపాధ్యాయులు రెడ్డయ్య తెలిపారు. శుక్రవారం జడ్‌పి హైస్కూల్ మైదానంలో ఎజిఎఫ్ క్రీడా పోటీలు నిర్వహిస్తుండగా విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, విజ్ఞప్తి మేరకు విద్యార్థులందరికీ సొంత నిధులతో క్రీడా దుస్తులు అందించినందుకు ఎంపిపికికృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రతిభను కనబరచి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఆర్థికంగా అన్ని విధాలుగా తోడు ఉంటామని అన్నారు.




క్రీడలను ప్రారంభిస్తున్న జడ్‌పిటిసి శివరాంగౌడ్

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జడ్‌పిటిసి శివరాంగౌడ్, ఎస్ఐ మోహన్‌నాయక్ పేర్కొన్నారు. ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు వైసిపి నాయకుడు వీరనాగిరెడ్డి, జడ్‌పిటిసి శివరాం గౌడ్, ఎస్ఐమోహన్, స్కూల్ చైర్మన్ రమణలు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలిగి ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ లను అండర్-14, అండర్-17 విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ద్వారా ఎంపిక చేయబడిన క్రీడాకారుల జట్లు రాజంపేటలో నియోజకవర్గ స్థాయిలో జరగబోయే పోటీల్లో పాల్గొంటారని మండల కో-ఆర్డినేటర్ వేణు మాధవ్‌రాజు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రవీంద్ర రాజు, మదన్మో హన్‌రెడ్డి, శేఖర్, విష్ణు, ఉమాదేవి, పార్వతి, విఆర్‌డిఎస్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం..పర్యావరణాన్ని కాపాడుదాం



రైల్వేకోడూరు : మొక్కలు నాటుతున్న డ్వామా పీడీ మద్దిలేటి, మాజీ ఎమ్మెల్సీ బత్యాల

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని డ్వామా పీడీ ఎంపిసి మద్దిలేటి అన్నారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం,స్వచ్ఛతహి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా రోడ్డు కిరువైపులా చెట్లు నాటుట, సామూహిక వన పెంపకం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కొత్తకోడూరులో రోడ్డు ఇరువైపులా చెట్లు నాటే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడుతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు మానవ జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది రాజంపేట ఎపిడి ప్రతాప్,ఎపిఒ ఉమామహేశ్వర్ రావు, స్థానిక సర్పంచ్ బుడిగి శివయ్య, స్థానిక గ్రామపంచాయతీ ఇఒ ప్రసాద్‌రావు, టిడిపి, జనసేన, కూటమి నాయకులు పి.నవీన్, ఎన్.హేమరాజ్, సాయిఆచారి, రామకృష్ణ, సురేష్, కుమార్, మాజీ జడ్‌పిటిసి మారెళ్ళ రాజేశ్వరి పాల్గొన్నారు.**నందలూరు:** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపిడిఒ సౌభాగ్యమ్మ పేర్కొన్నారు. టివి పురం గ్రామ పంచాయతీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ బయన బోయిన లక్ష్మీదేవి, బిసి సంఘం నియోజకవర్గం అధ్యక్షులు భాస్కర్ యాదవ్ ల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.కార్యక్రమంలో ఎపిఒ దిలీప్ కుమార్, పంచాయతీ సెక్రటరీ సురేష్, టెక్నికల్ అసిస్టెంట్ తులసి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లి :** కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి తన తల్లి చెన్నమ్మ పేరుతో మొక్కలు నాటారు. పర్యావరణం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కురవంక పంచాయతీ సెక్రటరీ షబానా, బిల్డర్ బోయపాటి మురళినాయుడు, వార్డు మెంబర్ నాగరాజా, నాయకులు శ్రీనివాసులు, పంచాయతీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **రామాపురం:** మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని నీలకంఠరావుపేట ఉప సర్పంచ్ మహబూబ్ పేర్కొన్నారు. నీలకంఠరావుపేట సచివాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మానవులకు కొత్త వ్యాధులు ప్రబలడం మానవాళి మనుగడకు ఆక్సిజన్ ఎంత అవసరమని చెట్టు ఉండటం వల్ల ప్రకృతి వరమైన స్వచ్ఛమైన గాలి మంచి ఆక్సిజన్ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, పీడీ నరేంద్ర కుమార్‌రెడ్డి, సచివాలయ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** పిటిఎం ప్రభుత్వ మోడల్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. తహశీల్దార్ యం.శ్రీరాములు నాయక్, ఎంపిడిఒ బాలాజీ, పంచాయతీ విస్తరణ అధికారి యోగానంద, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శివకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది, ఉపాధి హామీ ఎపిఒ యం.తిరుపాలప్ప, సచివాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.**వాల్మీకిపురం:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని ఎంపిడిఒ మనోహరరాజు పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తల్లిపేరిట మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ ఇఒ ఉదయ్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి శివ మోహన్, ఈవోపిఆర్‌డి శ్రీనివాసులు, పిఆర్ ఎఇ కమలాకర్ రెడ్డి, టిడిపి నాయకులు మల్లికార్జున రెడ్డి, వలిగట్ల వెంకటరమణ, చంద్రమౌళి పాల్గొన్నారు. **కలకడ :** జీవరాసులు మనుగడకు ప్రతి ఒక్కరూ చెట్టు నాటి వాటిని సంరక్షించు కోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మల్లికార్జున, పంచాయతీ, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు. **గాలివీడు:** మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మొక్కలు నాటడం జరిగినది. గుండ్లచెరువు గ్రామ పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్, ప్యారంపల్లి గ్రామ పంచాయతీలలో ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాసులురెడ్డి, ఇఒపిఆర్‌డి శేఖర్‌నాయక్, ఎఇ పీర్ రాజశేఖర్, ఎపిఒలు, ఉపాది హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఒ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పీలేరు :** ప్రజలు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పీలేరు ఎంపిడిఒ ఉపేంద్ర కుమార్‌రెడ్డి తెలిపారు. పీలేరు మండలం, బోడుమల్లువారిపల్లి పంచాయతీ సచివాలయం వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పీలేరు ఎంపిడిఒ ఉపేంద్రకుమార్‌రెడ్డితో పాటు సచివాలయ కార్యదర్శి హరిప్రసాద్ నాయుడు, ఉపాధి హామీ పథకం ఎపిఒ మహేష్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



పీలేరు : మొక్క నాటుతున్న ఎంపిడిఒ ఉపేంద్రకుమార్‌రెడ్డి

క్షేమంగా ఇంటికి చేరిన కువైట్ బాధితురాలు

అండగా నిలిచిన మంత్రి నారా లోకేష్
ఆర్థిక సాయం అందించిన జనసేన నాయకులు



మైమూన్‌బీకి ఆర్థిక సాయం అందిస్తున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

జీవనోపాధి కోసం కువైట్ కు వెళ్లిన మహిళకు అక్కడ అనుకోని ఇబ్బందులు ఎదురయ్యాయి. వాటిని అన్నింటిని తట్టుకుంటూ జీవనం సాగిస్తున్న, చివరకు తన భర్త మరణించగా ఇంటికి వెళ్లాలని అక్కడ ఇంటి యజమానిని బ్రతిమాలిన బాధితురాలికి తన భర్త చివరి చూపును చూసుకొనే అవకాశం కూడా లేక బోరుణ విలపించింది. బాధితురాలు కువైట్ లో పడుతున్న నరకయాతనను వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో, మీడియా ద్వారా మంత్రి నారా లోకేష్ దృష్టికి చేరేలా ప్రయత్నించింది. కువైట్‌లో మహిళ పడుతున్న బాధలను తెలుసుకున్న మంత్రి నారా లోకేష్ బాధితురాలని ఇండియాకు రప్పించడానికి విదేశాంగ వ్యవహారాల శాఖలతో చర్చించి కృషి చేశారు. ఫలితంగా బాధితురాలు క్షేమంగా తన ఇంటికి చేరుకుంది. వివరాల్లోకి వెళితే..నిమ్మనపల్లె మండలం, వెంగంవారి పల్లె పంచాయతీ, సింగంవారి పల్లెకు చెందిన రెడ్డిబాషా భార్య మైమూన్ బీ తన భర్త అనారోగ్యంతో బాధపడుతున్నందున, తన కుటుంబ పోషణకై, బతుకుతెరువు కోసం, చేసిన అప్పులను తీర్చుకోవడానికి కువైట్‌కు వెళ్లినట్లు తెలిపారు. కువైట్‌కు వెళ్లిన ఆరు నెలల్లోనే ఒక ఇంటి నుంచి మరొక ఇంటికి మారగా, గత 18 నెలలుగా ఒకే ఇంటిలో ఉంటూ పనిచేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన భర్త ఇటీవల మృతి చెందారని అన్నారు. ఇదే విషయం కువైట్ లో తను పనిచేస్తున్న ఇంటి యజమానికి తెలిపి, తన భర్తను కడసారిగా చూసుకోవడానికి ఇండియాకు పంపాలని అడగగా వారు పంపలేదన్నారు. తన భర్త చనిపోయిన విషయాన్ని వీడియో తీసి ఇంటి యజమానికి చూపించిన కనికరించలేదని, చిత్రహింసలు పెట్టిందని అన్నారు. చేసేదేమీ లేక తన బాధలను వీడియో తీసి ప్రభుత్వానికి మీడియా ద్వారా తెలియజేయగా, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ స్పందించి బాధితురాలని ఇంటికి రప్పించినట్లు తెలిపారు. మరోవైపు బాధ్యతరాలి కుమారుడు సయ్యద్‌బాషా కూడా అనారోగ్యంతో బాధపడుతున్నారని, ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితురాలు వేడుకొన్నారు. మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ పోషణకై కువైట్ వెళ్లి నరకయాతన అనుభవించి, ప్రభుత్వ సహకారంతో క్షేమంగా ఇంటికి చేరుకున్న బాధితురాలు మైమున్ బి కి జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఈతకట్ట చంద్రశేఖర్ బాధితురాలికి 5 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని జన సైనికులు రమణ, శివ కుమార్ లతో కలసి అందించారు. బాధితురాలికి మరింత సాయం అందించి వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

మండల సమావేశాన్ని అడ్డుకున్న కూటమి నాయకులు
భారీగా మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల సర్వసభ్య సమావేశాన్ని టిడిపి, జనసేన కూటమి నాయకులు అడ్డుకోవడంతో ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. వైసిపి ప్రభుత్వంలో వీరంతా దొంగచాటున ఎంపిటిసిలు అయ్యారని, ప్రజల చేత ఎన్నుకోబడిన వారు కాదని వెంటనే రాజీనామా చేసి ప్రజల్లోకి వెళ్లాలని డిమాండ్ చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడిన అనంతరం సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, లేనిపక్షంలో ఈ సర్వసభ్య సమావేశాన్ని ఎప్పుడు అడ్డుకుంటామని టిడిపి శ్రేణులు హెచ్చరించారు. గత ప్రభుత్వంలో అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని ఎన్నికలు జరపకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ఏకగ్రీవం చేసుకున్నారని ఆరోపించారు. గో బ్యాక్ ఎంపిటిసిలు అంటూ నినాదాలు చేయడంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడంతో బి.కొత్తకోట సిఐ రాజారెడ్డి, మొలకలచెరువు సిఐ రాజురమేష్, పోలీసు బలగాలు భారీగా మోహరించారు.




నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న ఎంపిపి లక్ష్మీనరసమ్మ

మండల అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని కార్యాల ఆవరణంలో ఎంపిపి లక్ష్మీనరసమ్మ నేలపై కూర్చొని నిరసన తెలిపారు. ఎంపిడిఒ శంకరయ్య మాట్లాడుతూ ఎంపిటిసి ఫోరం సభ్యులు మెజార్టీ లేకపోవడంతో మండల సర్వసభ సమావేశాన్ని రద్దు పరిచినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-పీలేరు : రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రెడ్డి రమేష్‌బాబు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబును కలిసి వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం చిత్తూరు జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని ఆయన బంగారుపాలెంలో కలిసి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ పక్షాన ప్రాతినిధ్యం వహిస్తూ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారని రెడ్డి రమేష్ బాబు అన్నారు. జిఒ నెంబర్ 117 రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని, మెర్జింగ్ తరగతులను వెనక్కు పంపాలని, నాడు - నేడు పనుల్లో జరిగిన అవకతవకలకు హెడ్మాస్టర్లను బాధ్యులు చేయరాదని కోరారు. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడంలో భాగంగా మోడల్ స్కూల్ కాంప్లెక్స్‌ఏర్పాటు చేసి విద్యార్థులకు రవాణా సౌకర్యం సమకూర్చాలని, కామన్ సర్వీస్ రూల్స్ పై ప్రభుత్వం చొరవ చూపి పరిష్కార దిశగా ప్రయత్నం చేయాలని తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ దిశగా ఆలోచించాలని, సర్దుబాటు ప్రక్రియలో సుదూర ప్రాంతాలకు కేటాయించబడిన ఉపాధ్యాయులను తిరిగి వారి స్థానాల్లోకి పంపాలని అన్నారు. నెలవారీ ప్రమోషన్లు క్రమం తప్పక నిర్వహించాలని, బాలికలు చదువుతున్న ప్రతి పాఠశాలలోనూ కనీసం ఒక మహిళా ఉపాధ్యాయురాలు పనిచేయునట్లు చూడాలన్నారు.కస్తూరిబా పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని, ప్లస్ టు టీచర్లుగా పనిచేస్తున్న వారిని జూనియర్ లెక్చరర్లుగా పేరు మార్చాలని, ప్లస్ టు కోర్సుల్లో కో ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టాలని, సర్దుబాటు ప్రక్రియలో అన్యాయం జరిగిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.



సోమశంకర్ నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న జలగం శివయ్య

ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎస్‌టి బాలికలపై కులం పేరుతో దూషించిన ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ యానాది సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జలగం శివయ్య, ప్రధాన కార్యదర్శి పులి శివశంకర్ కోరారు. శుక్రవారం రాజంపేట ఆర్ అండ్ బి అతిథి గృహంలో విడిది చేసిన రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు ఒడిత్య సోమశంకర్ నాయక్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జలగం శివయ్య, ప్రధాన కార్యదర్శి పులి శివశంకర్, మహిళా అధ్యక్షురాలు నీలం అంకమ్మలు కలిసి గిరిజన సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గంలోని అనంతరాజుపేటలో 2001లో ఏర్పాటుచేసిన గిరిజన బాలికల పాఠశాలలో సరియైన మౌలిక వసతులు లేక, వంట మనసులు లేకపోవడంతో పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులే అన్ని కార్యక్రమాలు నిర్వర్తిస్తూ విద్యార్థులను వినియోగించుకునే వారని తెలిపారు. 2016లో బాధ్యతలు స్వీకరించిన తెలుగు ఉపాధ్యాయురాలు విద్యార్థులను కులం పేరుతో అనేకమార్లు దూషించి కించపరిచినట్లు తెలిపారు. చురుగ్గా ఉన్న విద్యార్థులను ప్రలోభ పెట్టి సక్రమంగా విధులు నిర్వహించే ఉపాధ్యాయుల పట్ల ఆరోపణలు చేసి, విద్యార్థుల నుంచి వీడియోలు తీయించి తప్పుడు సమాచారం అందించినట్లు వివరించారు. రైల్వే కోడూరు మండలంలో సుమారు 20వేల మంది పైగా యానాదులు జీవనం సాగిస్తున్నారని, వారికి నేటికీ గుర్తింపు కార్డులు గాని, ఆధార్ కార్డులు గానీ లేవని, గెజిటెడ్ అధికారులు వారిని గుర్తించి గుర్తింపు కార్డులు అందజేసి వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

వాల్మీకిపురం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని గురుకుల పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషణ మాసోత్సవంలో భాగంగా ఐసిడిఎస్ సిపిడిఒ భారతి బాల్యవివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. మహిళలకు ఉన్న చట్టాల గురించి, దిశ యాప్ గురించి బాలికలకు జరిగే అన్యాయాల గురించి టోల్ ఫ్రీ నంబర్లపై తెలియజేశారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు పూర్తయ్యేంత వరకు వివాహాలు చేయకూడదని సూచించారు. బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని తల్లిదండ్రులతో పాటు వివాహానికి హాజరైన వారిపైకూడా కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని తమ పిల్లలను చక్కగా చదివించుకొని మంచి భవిష్యత్తును ఇవ్వాలని తెలిపారు. మంచి ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల అసిస్టెంట్ ప్రిన్సిపల్ స్వర్ణలత, తెలుగు టీచర్ భ్రమరాంబిక, ఐసిడిఎస్ సిపిడిఒ భారతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుంధతి, అంగన్వాడీ టీచర్లు రెడ్డిరాణి, ప్రమీలభాయ్, రాణి ప్రమీల విద్యార్థినిలు పాల్గొన్నారు.

24న విభిన్న ప్రతిభావంతులకు సహాయ పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో విభిన్న ప్రతిభావంతులకు ఈనెల 24న సహాయ పరికరాల కోసం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షులు మల్లు సుబ్బనరసారెడ్డి పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతులకు కావలసిన పరికరాల కోసం వారి వారి మండలాలలో నిర్వహించబోయే శిబిరంలో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు, యు డిఐడి కార్డు, సదరం సర్టిఫికేట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకుని రావలెనని సూచొచారు. ఈ శిబిరం జిల్లా సంక్షేమ సంచాలకుల ఆధ్వర్యంలోనిర్వహించడం జరుగు తుందని ఐదు మండలాలలోని విభిన్న ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాడి ఆవుల పోషణలో మెలకువలు పాటించాలి


ప్రజాశక్తి తంబళ్లపల్లె

పాడి ఆవుల పోషణలు రైతులు ముందస్తు మెలకువలు పాటించడం ముఖ్యమని పశు వైద్య అధికారిని డాక్టర్ సుజనాశ్రీ తెలిపారు. శుక్రవారం మండలంలోని కన్య మడుగు పంచాయతీ మరిమీరెడ్డిగారిపల్లెలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. 68 పశువులకు బో టాక్స్ స్ప్రే, పది పశువులకు గర్భకోశ పరీక్షలు. 60 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలువేశారు. పశువులకు ఆరోగ్యం చేకూరేందుకు మినరల్ మిక్సర్ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో వాటర్ షర్ట్ టెక్నికల్ ఆఫీసర్ రాధా, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆర్.ఉప్పరపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీపాల ఉమామహేశ్వర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. శుక్రవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్‌బివిడి సభ జూనియర్ కళాశాలలో గజమాల, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు అంకితభావంతో సేవలను అందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ బుధారపు నరేంద్రనాథ్, సభా సంస్థల కస్పాండెంట్ నూకల శ్రీరాములు, ప్రిన్సిపల్ ఎ.బాలాజీ రాజు, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, మునిరత్నం, సి.వి రమణ మూర్తి , ఇఒపిఆర్‌డి పెంచలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వర్‌ను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె-కర్ణాటక సరిహద్దులోని రాయల్పాడు వద్ద గురువారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా, అతని తల, మొండెం వేర్వేరుగా ఎగిరిపడ్డాయి. రాయల్పాడు ఎస్ఐ యోగేష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం, చీకలబైలుకు చెందిన గుర్రప్ప కుమారుడు గుణశేఖర్ ద్విచక్ర వాహనంలో కర్ణాటక ప్రాంతానికి వెళ్లి మద్యం కొనుగోలు చేసి ఆంధ్రలో విక్రయించేందుకు తీసుకు వస్తున్నాడని తెలిపారు. మార్గమధ్యంలోని రాయల్పాడు వద్ద ప్రయివేట్ బస్సు ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో గుణశేఖర్ దుర్మరణం చెందాడని తెలిపారు. రాయల్పాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీనివాసపురం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.